సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 2 । జూలై । 2025



మంత్రిని కలిసిన నాయకులు

సిరిసిల్లటౌన్: ఉమ్మడి కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మంగళవారం పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య మర్యాదపూర్వకంగా కలిసి రాజన్న ప్రసాదం అందజేశారు.



నృసింహుని సేవలో ఎస్పీ

వేములవాడఅర్బన్: నాంపెల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం ఎస్పీ మహేశ్ బీ గితే దర్శించుకున్నారు. ఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

మురుగుతున్న నిర్లక్ష్యం

- సిరిసిల్ల బల్దియాలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- మోరీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మురికికూపాలుగా ఓపెన్‌ప్లాట్లు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



- 'ఇది సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిలోని చంద్రంపేట క్రాసింగ్ రోడ్డు. ఇక్కడ డ్రైనేజీ కాల్వ దెబ్బతిని ఏళ్ల గడుస్తోంది. గతంలో పాలకులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు అధికారులు ఇటువైపు కూడా చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రధాన దారి వెంట మురికికూపం తయారవడం అధికారుల పనితనానికి ఇదో నిదర్శనం'.



'ఈ కచ్చా కాల్వ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలోనిది. దీని నిండా పిచ్చిమొక్కలు పెరిగి మురుగు నీరు నిలుస్తోంది. జనావాసాల మధ్య ఉన్న ఈ మురికికూపంతో దోమలు వృద్ధిచెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కాలువలో కనీసం ఆయిల్‌బాల్స్ వేయడం, వార్డులో ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు'.



- 'ఈ ఫొటోలో ఉన్నది కొత్తచెరువు సమీపంలోని మురుగునీటి కల్వర్టు. పూర్తిగా చెత్తతో నిండింది. డ్రైనేజీల్లో సిల్ట్ తీయడంలో బల్దియా నిర్లక్ష్యానికి ఇదో తార్కాణం. కల్వర్టు నుంచి దుర్గంధం వెలువడి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలకు ఆవాసంగా మారిన ఈ డ్రైనేజీని శుభ్రం చేయకుండా నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి'.

సిరిసిల్ల మున్సిపల్ ప్రొఫైల్

పట్టణ జనాభా	1,11,000
వార్డులు	39
శానిటేషన్ సిబ్బంది	277
డ్రైనేజీ	398.76 కి.మీ
వరదకాల్వలు	11 కి.మీ
కచ్చానాలాలు	123.44 కి.మీ
సీసీడ్రైన్స్	264.32కి.మీ

సిరిసిల్లటౌన్: వర్షాకాలం వ్యాధులు విజృంభిస్తున్నాయి. మోరీల్లోంచి మురుగునీరు రోడ్డుపై పారుతోంది. కచ్చానాలాలు దోమల ఆవాసాలయ్యాయి. ప్రధాన డ్రైనేజీలు ముక్కుపుటాలు అదిరేలా కంపుగొడుతున్నాయి. సిల్ట్ తీయడంలో బల్దియా నిర్లిప్తత, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వెరసి స్వచ్ఛతలో సిరిసిల్ల ఘనకీర్తి మసకబారుతోంది. ప్రధాన రోడ్లు, కూడళ్లలో పారిశుధ్యం పడకేయడం అధికారుల పనితనాన్ని వెక్కిరిస్తుంది. పరిశుభ్రతలో ఆదర్శ విధానాలు అవలంబించిన సిరిసిల్ల బల్దియా తడబాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. అధికారులు ఇప్పటికైనా తేరుకుని అస్తవ్యస్తమైన పారిశుధ్య విధానాలను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛత.. ఇదేనా బాధ్యత

స్వచ్ఛతపై బల్దియా కొంతమేర బాధ్యతను విస్మరిస్తుంది. కొన్నేళ్ల పాటు జాతీయస్థాయిలో వందశాతం పారిశుధ్య అవార్డులు సాధించగా, కొద్దిరోజులుగా పట్టింపులేమిగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లైన పాతబస్టాండు, చంద్రంపేట క్రాసింగ్ వద్ద రోడ్డుపై మురుగునీరు నిలవడం బల్దియా పనితీరుకు నిదర్శనంగా ఉంటోందని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం అమలులో ఉన్నా డ్రైనేజీ వ్యవస్థలో లోటుపాట్లతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇక విలీన గ్రామాలు చంద్రంపేట, రగుడు, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, చిన్నబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లో డ్రైనేజీల్లేక ప్రజలు మురుగునీటిని దాటుతూ బయటకు వెళ్లాల్సి వస్తుంది. ఏజెన్సీ ప్రాంతాలను మరిపించేలా విలీన గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఉంటోంది.

డ్రైనేజీ వ్యవస్థలో లోటుపాట్లు

- పట్టణంలోని 39 వార్డుల్లో 277 మంది శానిటేషన్ సిబ్బంది, ప్రత్యేక అధికారులు పనిచేస్తున్నారు. ప్రత్యేక పాలనలో రోజూ అధికారుల వార్డుల సందర్శన అంతంతే ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.
- పాతబస్టాండు ప్రాంతంలోని ప్రధాన డ్రైనేజీ తరుచూ నిండి రోడ్డుపై మురుగు పరుగులు పెడుతోంది. ఇక్కడ సుమారు రూ.30లక్షలకు పైగా నిధులతో నిర్మించిన డ్రైనేజీలో పై ప్రాంతాల నుంచి వచ్చే నీరు సరిగా పారడం లేదన్న విమర్శలున్నాయి.
- పెద్దబజారు, బీవైనగర్, పద్మనగర్, అనంతనగర్, డాక్టర్స్‌స్ట్రీట్, రాళ్లబావి, శాంతినగర్, సాయినగర్, వెంకంపేట, తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలకు మరమ్మతు చేయాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.
- విలీన గ్రామాల్లో సీసీ డ్రైనేజీల కోసం ప్రజలు ఎన్నోసార్లు అర్జీలు పెట్టుకున్నా పూర్తికావడం లేదు. వర్షాలు పడితే ఇళ్లలోకి, రోడ్లపైకి మురుగు పారుతూ ప్రజలు దుర్గంధంలో మగ్గుతున్నారు.



శాంతినగర్- శ్రీనగర్‌కాలనీ దారిలో నిలిచిన నీరు



గుంతలమయంగా ఇప్పలపల్లి- మెడికల్ కళాశాల దారి



శ్రీనగర్‌కాలనీలో బురదమయమైన రోడ్డు



12వ వార్డులో డ్రైనేజీ దుస్థితి



ఒకటో వార్డులో నిధులు మంజూరైన కట్టని డ్రైనేజీ

ఎవరికి చెప్పాలో తెలియడంలేదు



మా వార్డులో సీసీ మోరీల్లేక కచ్చా కాల్వల్లో దోమలు పెరిగినయి. పెద్దమోరీలు, ఓపెన్‌ప్లాట్లలో మురుగునీటితో ఒకటే దుర్గంధం. మోరీలు శుభ్రం చేయాలని ఎవరికి చెప్పాలో తెల్వడం లేదు. పాలకవర్గం గడువు తీరినప్పటి సంది అధికారులు పారిశుధ్యంపై పట్టించుకోవడం లేదు.

– సుల్తాన్ బాలరాజు, చంద్రంపేట

కాల్వ నిర్మించాలి



వానలు పడుతున్నయి. మోరీలు సరిగా లేక దోమలు పెరిగినయి. వాడకట్టులో చాలా మందికి జ్వరాలు వస్తున్నయి. మా కాలనీలో కచ్చాకాల్వ స్థానంలో సీసీ డ్రైనేజీ కడుతామన్నరు. మోరీల్లోంచి సిల్టును ఎప్పటికప్పుడు తీసేయాలి. ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు ఉండకుండా చూడాలి.

– అన్నారపు దేవేందర్, శ్రీనగర్‌కాలనీ

న్యూస్‌రీల్

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు

వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డి సహకారం, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కృషితో వేములవాడ నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కథలాపూర్ మండలం సిరికొండలోని రేణుక ఎల్లమ్మ, రాజరాజేశ్వర స్వామి, మేడిపల్లి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి, వేములవాడ అర్బన్ మండలం మారుపాకలోని పెద్దమ్మతల్లి ఆలయాలకు రూ.1.95 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి రాజన్న ప్రసాదం



రామచందర్‌రావుతో స్థానిక నాయకులు

వేములవాడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రామచందర్‌రావును మంగళవారం జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న ప్రసాదం అందించి శాలువాతో సత్కరించారు. వారి వెంట కోల కిష్టస్వామి, రేగుల మల్లికార్జున్, చంటి మహేశ్, రేగుల శ్రీకాంత్ ఉన్నారు.

బందనకల్ అమరులకు నివాళి



మాట్లాడుతున్న విమలక్క

సిరిసిల్ల: బందనకల్ అమరులకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఘనంగా నివాళి అర్పించింది. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంస్మరణ సభలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడారు. అభ్యుదయ సమాజం కోసం అమూల్యమైన ప్రాణాలు త్యాగం చేసిన కామ్రేడ్ రియాజ్ తదితర అమరులను కొనియాడారు. అసమానతలు లేని సమాజం కోసం నక్సలైట్లు కోరుకుంటుంటే అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు రెండు లక్షల ఎకరాల అడవిని అప్పగించేందుకు మోదీ, అమిత్ షా ప్రయత్నిస్తున్నారన్నారు. అరుణోదయ కళాకారిణి విమలక్క మాట్లాడుతూ, ప్రకృతి వనరులను విధ్వంసం చేయడంతో పాటు ఆదివాసీల జీవితాలను ఛిద్రం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. జీవన్‌కుమార్, కట్టా భగవంతరెడ్డి, అరుణోదయ ప్రతినిధులు మల్సూర్, పోతుల రమేశ్, రైతు కూలీ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి కొమురయ్య, రాయమల్లు, యాకన్న, అరుణ పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



రన్నింగ్ పోటీలో విద్యార్థులు

సిరిసిల్లటౌన్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ట్రయాతలాన్ ఎంపిక పోటీలు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీగ్రౌండ్‌లో జరిగాయి. జిల్లాలోని వివిధ మండలాల క్రీడాకారులు పాల్గొని వివిధ క్రీడాంశాల్లో ప్రతిభచాటారు. ఈనెల 6న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే స్టేట్ లెవల్ పోటీలకు 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి రామచంద్రం, ఎస్‌ఐ గొట్టే రామచంద్రం తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, పీఈటీలు అజయ్‌కుమార్, శ్రీనివాస్, రవి, హనుమంతు అభినయ పెప్సిబా, బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ముసురు వాన



సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం ముసురు వర్షం కురిసింది. అత్యధికంగా ముస్తాబాద్‌లో 24.1 మి.మీ వర్షం పడగా , రుద్రంగి 6.4, చందుర్తి 9.6, వేములవాడరూరల్ 8.6, బోయినపల్లి 6.5, వేములవాడ 12.5, సిరిసిల్ల 11.6, కోనరావుపేట 15.6, వీర్నపల్లి 10.7, ఎల్లారెడ్డిపేట 9.5, గంభీరావుపేట 22.6, తంగళ్లపలి 15.3, ఇల్లంతకుంటలో 12.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 12.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.

లక్ష్యం మేరకు అడ్మిషన్స్ సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల: ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్ విద్యపై ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 10 ప్రభుత్వ కళాశాలల పరిధిలో ఫస్టియర్‌లో 1,777 అడ్మిషన్స్ సాధించడం లక్ష్యం కాగా 1,116 మందిని ఎనరోల్ చేసుకోవడం జరిగిందన్నారు. అడ్మిషన్స్ పెంచేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలిచ్చారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసిందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇంటర్ విద్య చాలా వెనకబడిందని, పరీక్షల ఫలితాల్లో చాలా ఇంప్రూవ్ కావాలని సూచించారు. కళాశాలలో యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి పోలీసుల సహకారంతో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, కెరియర్ కౌన్సెలింగ్ అందించాలని కోరారు.జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టాలి

వేములవాడఅర్బన్: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం వేములవాడ మండలం చింతల్‌ఠాణా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో నిత్యం చదివించడం, రాయించడంపై దృష్టి సారించాలన్నారు. డెస్కులు తక్కువగా ఉండడంతో వేరే పాఠశాల నుంచి తెప్పించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైదానమిలా.. ఆడేదెలా..



సిరిసిల్లటౌన్: జిల్లా క్రీడాకారులకు ప్రధాన వనరు అయిన సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వర్షం నీరు నిలిచి మంగళవారం ఆటలకు ఇబ్బందిగా మారింది. సుమారు రూ.కోటితో చేపట్టిన గ్రౌండు అభివృద్ధి పనులు పూర్తికాక తరుచూ ఇలా క్రీడలకు ఇబ్బంది కలుగుతుంది. బురదతో నిండిన మైదానంలో పలు పోటీలు నిర్వహించగా క్రీడాకారులు ఇబ్బందిపడ్డారు.

బడిని బతికించిన ఉపాధ్యాయుడు



విద్యార్థులతో ఉపాధ్యాయుడు రవి

వేములవాడరూరల్: ఆ బడి ఒకప్పుడు పిల్లలతో కళకళలాడేది. అలాంటి బడి కొన్నేళ్లు విద్యార్థులు తగ్గి వెలవెలబోయింది. ఏడాది క్రితం వచ్చిన ఉపాధ్యాయుడు పట్టుదలతో ఇంటింటా తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ బడిని బతికించుకుందామని అవగాహన కల్పించారు. అన్ని సౌకర్యాలు ఉన్న బడిలో పిల్లలను చేర్పించాలని, ప్రైవేటుకు వద్దంటూ చెప్పిన మాటలకు తల్లిదండ్రులు ఆకర్షితులయ్యారు. ప్రస్తుతం కళకళలాడుతున్న బడిని చూసి గ్రామస్తులు, మండల అధికారులు ఇటీవల ఆ ఉపాధ్యాయుడిని సత్కరించారు.

8 మంది నుంచి 38..

ఏడాది క్రితం ఉపాధ్యాయుడు ఊరడి రవి వేములవాడ మండలం లింగంపల్లి పాఠశాలకు బదిలీపై వచ్చారు. అప్పుడు 1 నుంచి 3వ తరగతి వరకు 8 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. విశాలమైన ప్రాంతంలో అన్ని సౌకర్యాలు ఉన్న ఈ పాఠశాలకు పిల్లలు ఎందుకు రావడం లేదంటూ ఆరా తీశారు. వెంటనే ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ప్రస్తుతం 1 నుంచి 4వ తరగతి వరకు మొత్తం 38 మంది పిల్లలను చేర్పించి పూర్వ వైభవం తీసుకువచ్చారు. గతంలో బాలనగర్‌లోని పాఠశాల మూతపడగా ఇదే ఉపాధ్యాయుడు ఆ బడికి ప్రాణం పోసి విద్యార్థులను చేర్పించడంతో ప్రస్తుతం అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులతో ఆ స్కూల్ కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో బోధిస్తూ, పిల్లలను చేర్పించడంలో చొరవ చూపుతున్న కొంత మంది ఉపాధ్యాయులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

చేపలవేట నిషేధం

సిరిసిల్ల కల్చరల్: జిల్లాలోని జలాశయాల్లో రెండునెలల పాటు చేపలవేటపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మత్స్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లాలోని మధ్యమానేరు, ఎగువ మానేరు, అన్నపూర్ణ జలాశయాల్లో చేపలు పట్టడాన్ని నిషేధించారు. రెండు నెలల్లో చేపవి త్తనాల విసర్జన చేయడంతో పాటు వాటి సంతతి అభివృద్ధి చెందుతుందన్నారు. అధికారిక అనుమతి పొందిన మత్స్యకారులు, ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తమ పరిధిలోని మ త్స్యకారులకు ప్రభుత్వ ఆదేశాల గురించి స్ప ష్టం చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

బాలిక మృతిపై అడిషనల్ ఎస్పీ విచారణ



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తి(వేములవాడ): ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బాలిక మృతిచెందిన ఘటనపై ఏఎస్పీ చంద్రయ్య విచారణ చేపట్టారు. మండలంలోని కిష్టంపేటకు చెందిన కుదురిక మహేశ(8) గత నెల 19న పత్తి చేనులో తేలుకాటుకు గురైంది. తల్లిదండ్రులు లావణ్య, రమేశ్ వెంటనే జోగాపూర్‌కు చెందిన ఆర్‌ఎంపీ సంజీవ్‌తో వైద్యం చేయించారు. 20న బాలిక పల్స్ పడిపోవడంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో గత నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బాలిక చికిత్స పొందుతూ 28న మృతిచెందగా, ఆర్‌ఎంపీని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఏఎస్పీ మంగళవారం బాలిక తల్లిదండ్రుల స్టేట్‌మెంటును రికార్డు చేశారు. అనంతరం ఎస్సీ కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేసి మెడికల్ ఎమర్జెన్సీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మూఢనమ్మకాలను వదిలిపెట్టాలని సూచించారు. ఆపద సమయంలో ప్రజలకు పోలీసులు అండగా నిలుస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్ ఉన్నారు.

సైబర్ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

- ఎస్పీ మహేశ్ బీ గితే



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బీ గితే

సిరిసిల్లక్రైం: సైబర్ ఫిర్యాదులపై తక్షణం స్పందించి కేసులు నమోదు చేయాలని ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించాలని, బ్యాంకులో డబ్బు ఫ్రీజ్ అయి ఉంటే వీలైనంత త్వరగా తిరిగి వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌కు ఫోన్ నంబర్ కేటాయించినట్లు వివరించారు. సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమని, మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. డిజిటల్ అరెస్టు లని కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్ల బలంగా మారిందని, వారి వలలో పడకుండా ఉండటానికి అప్రమత్తతే ప్రధాన ఆయుధం అన్నారు. జిల్లా సైబర్ సెల్ ఆర్ఎస్సై జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిని పోషించకుంటే ఆస్తి దక్కదు



బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్లకల్చరల్: వయోధికులకు ఎదురైన సమస్యలు పరిష్కరించేందుకు ఆర్డీవో వెంకటేశ్వర్లు మంగళవారం బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పెద్దూరు గ్రామానికి చెందిన గౌడుగు ఎల్లవ్వకు రాములు, దేవయ్య సంతానం. భర్త జీవించి ఉన్న సమయంలో తన కున్న భూమిలోంచి మూడెకరాలు ఇద్దరు కొడుకులకు పట్టా చేయించాడు. మరో 2.19 ఎకరాలు ఎల్లవ్వ పేరున ఉంది. తల్లిని తానే పోషిస్తానని ఆమె పేరున ఉన్న భూమిని దేవయ్య పట్టా చేయించుకున్నాడు. అన్నదమ్ముల బేధాభిప్రాయాలతో తల్లి పోషణ బాధ్యతలను విస్మరించారు. దీంతో తన భూమి తనకు చెందేలా చూడాలని ఎల్లవ్వ ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంది. ఈక్రమంలో పోషణ బాధ్యతలు చేపట్టకుంటే ఆస్తిని తిరిగి తల్లి పేరుమీద మార్చేస్తామని, వారం రోజుల్లోపు తేల్చుకోవాలని ఆర్డీవో హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దేవిక, రాజ్యలక్ష్మి, సీనియర్ సిటీజన్ల సంఘం ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన మద్రిపల్లి హన్మండ్లు (85) మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హన్మండ్లు కొద్దిరోజులుగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతున్నాడు. హన్మండ్లు భార్య దుబ్బరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. హన్మండ్లు కుమారులు ఇద్దరు దుబాయ్‌లో ఉన్నారు. వారు బుధవారం స్వగ్రామానికి చేరుకున్నాక అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక..

మల్యాల: ఓ వైపు అనారోగ్యం.. మరోవైపు వైద్యానికి చేసిన అప్పులు.. వాటిని తీర్చే మార్గం కానరాక ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మద్దుట్లలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లూరి తిరుపతి(59) ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. సెప్టిక్ కావడంతో వైద్యానికి చాలా డబ్బులు ఖర్చయ్యాయి. కుటుంబ అవసరాలకు కూడా అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


రాజవ్వ(ఫైల్)

చందుర్తి (వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గసికంటి రాజవ్వ ఉరఫ్ ధర్మారం రాజవ్వ (110) మంగళవారం మృతిచెందింది. రాజవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కూతుళ్ల సంతానం. నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు పదేళ్లక్రితం మృతిచెందారు. చిన్న కుమార్తె పోశవ్వ తల్లితోనే ఉంటూ బాగోగులు చూసుకుంటోంది. సోమవారం సాయంత్రం వరకు తన పనులు చేసుకున్న రాజవ్వ ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి జారుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి చితికి చిన్నకూతురు నిప్పు పెట్టడాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు కంటతడి పెట్టారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పోక్సో కేసులో షేక్ అన్వర్(25)కు పదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి సునీత తీర్పు ఇచ్చినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం.. 2018లో బాధితురాలిని ప్రేమిస్తున్నాని నమ్మించి ఇంటినుంచి తీసుకెళ్లాడు. ఆ తర్వాత లైంగికంగా లోబర్చుకొని వదిలేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజేశ్.. నిందితుడు అన్వర్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి.. నేరం రుజువు కావడంతో షేక్ అన్వర్‌కు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు. నేరం రుజువయ్యేందుకు తగిన సాక్ష్యాలను ప్రవేశపెట్టిన పోలీసులను సీఐ అభినందించారు.

సాగులో 'డిజిటల్ టెక్నాలజీ'

- ఆధునిక వ్యవసాయం దిశగా అడుగులు
- యాప్, వాట్సాప్‌తో యువతరం కొంతపుంతలు
- ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం.. మార్కెట్ ధరలు


పంట చేనులో మొబైల్ యాప్ వినియోగం


పంట చేనులో యాప్ ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: మొన్నటివరకు పాతతరం రైతులు సాంప్రదాయ వ్యవసాయం చేస్తే.. నేటి యువతరం సాగును లాభసాటిగా మార్చుకుని.. ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీతో గ్రామీణ ప్రాంతాల్లో సిరులు పండిస్తున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన యాప్‌లను మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని.. ఆధునిక సేద్యానికి సన్నద్ధం అవుతున్నారు. సాగులో వస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా తమ స్నేహితులతో పంచుకుంటూ సాగుకు మరింత మెరుగులు దిద్దుకుంటున్నారు.

➡ విత్తనాలు వేసినప్పటి నుంచే..

బీటెక్, ఎంబీఏ చేసి.. కార్పొరేట్ కొలువులు చేస్తున్న యువత వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపుతోంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉండటం, అందులో వ్యవసాయ సమాచారాన్ని అందించే యాప్‌లు అందుబాటులోకి రావడం యువ రైతులకు కలిసి వస్తోంది. యాప్‌ల ద్వారా ఏ సమయంలో విత్తనం వేయాలి..? ఎలాంటి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి..? పంట ఎప్పుడు వస్తుంది..? ఆ పంటను కూలీల అవసరం లేకుండా యంత్రాల సహాయంతో ఎలా చేయవచ్చు..? పంటకు రోగాలు వస్తే చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, పంట పండితే ఎక్కడ మార్కెటింగ్ చేసుకోవచ్చు..? అనే విషయాలపై విపులంగా వీడియో రూపంలో ఉంటుండటంతో వాటిని ఆచరిస్తూ అధిక దిగుబడి తీస్తున్నారు. ఈ యాప్‌లను జాతీయ, అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యవసాయ ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలు ప్రత్యేకంగా రైతుల కోసం తయారు చేస్తున్నాయి. ఏ పంట సాగు చేస్తే.. ఆ పంట సాగు చేసే రైతులతో వాట్సాప్ గ్రూప్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. మొక్కలపై ఏ పురుగు కనబడినా వెంటనే సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసి శాస్త్రవేత్తలకు పంపిస్తూ.. వాటికి అవసరమైన సస్యరక్షణ చర్యలను చేపడుతూ ముందుకు సాగుతున్నారు.

➡ వ్యవసాయ వర్సిటీ యూ ట్యూబ్ ఛానల్

తెలంగాణ వ్యవసాయ వర్సిటి అగ్రికల్చర్ వీడియోస్ పేరుతో తెలుగులో యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తోంది. ఇందులో పంటల సాంకేతిక పరిజ్ఞానంతోపాటు రైతుల విజయగాథలు, పంట ఉత్పత్తులకు విలువలు జోడించి మార్కెటింగ్ చేయడం, ఆధునిక వ్యవసాయ పనిముట్ల గురించి వివరిస్తున్నారు.

➡ ప్లాంటిక్స్ యాప్

అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఇక్రిశాట్ రైతుల కోసం తెలుగు భాషలో ఈ యాప్‌ను రూపొందించింది. స్మార్ట్‌ఫోన్‌లోని కెమెరాతో తెగులు సోకిన మొక్కలను యాప్‌లో డౌన్‌లోడ్ చేయగానే.. కొద్ది వ్యవధిలోనే తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరిస్తారు.

➡ తెలంగాణ రైతు వెబ్ పోర్టల్

తెలంగాణ రైతు పోర్టల్ ద్వారా రైతులు వాతావరణం, మార్కెట్ సమాచారాన్ని పొందవచ్చు. అలాగే కిసాన్ పోర్టల్ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు, మట్టి నమూనా పరీక్షల వివరాలు తదితర వివరాలు ఉంటాయి.

➡ వరి నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ పోర్టల్

ఈ పోర్టల్‌ను భారతీయ వరి పరిశోధన సంస్థ రూపొందించింది. ఈ పోర్టల్ ద్వారా రైతులు వరి రకాలు, ఎరువుల యాజమాన్యం, కిసాన్ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రశ్నలకు సమాధానాలు, శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలను తెలుసుకోవచ్చు. అన్నపూర్ణ కృషి ప్రసార సేవ ద్వారా వ్యవసాయంతోపాటు ఉద్యాన పంటలు, పశుపోషణ, చేపల ఉత్పత్తి పెంపకంపై సలహాలు పొందవచ్చు.

➡ కిసాన్ సువిధ

దీని ద్వారా రైతులు రాబోయే ఐదు రోజులకు తమ ప్రాంతానికి సంబంధించిన వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, వ్యవసాయ సూచనలను తెలుసుకోవచ్చు. అలాగే, ఈనామ్ పోర్టల్ ద్వారా రాష్ట్రం, దేశంలోని ఈనామ్‌తో అనుసంధానమైన మార్కెట్లలో పంటల ధరలను తెలుసుకోవచ్చు. తెలంగాణ అగ్రిస్ నెట్ ద్వారా పురుగుమందుల వినియోగం, పంటలు విత్తే సమయం, ఎరువుల మోతాదు వంటి సేద్యానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఇందులో తెలుసుకోవచ్చు.

యాప్‌లను ఉపయోగిస్తాను



పంటల్లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అగ్రికల్చర్ యాప్స్‌లో ఉండే సమాచారాన్ని తెలుసుకుంటాను. కొత్త విషయాలను వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా తోటి రైతులకు తెలియజేస్తాను. ఇంట్లోనే కూర్చుని సాగు సమాచారాన్ని యాప్‌ల ద్వారా తెలుసుకునే అవకాశం రావడం నేటి యువతరం అదృష్టం.

– మెక్కొండ రాంరెడ్డి, యువ రైతు, ఆలూర్

శాస్త్రవేత్తలు, రైతులతో వాట్సాప్ గ్రూప్



రాబోయే రోజుల్లో ఆయా పంటల శాస్త్రవేత్తలు, సాగు చేసే రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే డాట్ సెంటర్‌ల పరిధిలో వాట్సాప్ గ్రూపులు ఉన్నాయి. అలాగే, తెలంగాణ వ్యవసాయ వర్సిటీ రైతుల కోసం యూట్యూబ్ ఛానల్‌తో పాటు అనేక యాప్‌లు ఉన్నాయి.

– శ్రీలత, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

నమ్మితే నట్టేట ముంచుడే..

- చేతబడి పేరుతో డబ్బులు గుంజుతున్న కేటుగాళ్లు
- లింక్‌లు పంపుతూ ఖాతాలు ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- మూఢనమ్మకాలు, అమాయకత్వంతో ఆర్థికంగా చితికిపోతున్న జనం


నిమ్మకాయలు, నల్లకోడితో నడిరోడ్డుపై పూజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రపంచం మొత్తం కంప్యూటర్, ఏఐ టెక్నాలజీ అంటూ పరుగులు తీస్తుంటే.. పల్లెల్లో మంత్రాలు తంత్రాలు అంటూ పంచాయితీలు పెట్టుకుంటున్నారు. చేతబడితో ఏదైనా చేయగలమని కొందరు మోసగాళ్లు చెబుతున్న మాటలు నమ్మి అమాయకులు డబ్బులు ఇస్తూ నిలువు దోపిడీకి గురవుతున్నారు. అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి వెళ్లాల్సిన వారు పల్లెల్లో తాయత్తులు కట్టేవారిని నమ్మి ప్రాణాలు తీసుకుంటున్నారు.

పలుచనవుతున్న బంధాలు

సమాజంలోని బంధాలు డబ్బు చుట్టే తిరుగుతున్నాయనేందుకు తాజాగా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో జరిగిన ఘటనే ఉదాహరణ. సొంత అల్లుడిని చంపించి బిడ్డను తమ వద్దకు తీసుకెళ్లేందుకు అత్తామామలే కుట్ర పన్నడం ఆలస్యంగా వెలుగుచూసింది. అది కూడా చేతబడి చేయించి చంపేందుకు అదే గ్రామానికి చెందిన ఒకరికి సుపారీ ఇవ్వడం సంచలనం రేపింది. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమాయకత్వమే ఆసరా

సైబర్‌నేరగాళ్లు లోన్‌లు ఇస్తామంటూ, బంపర్ డ్రా గెలుచుకున్నారంటూ ఫోన్‌లో మాట్లాడి పల్లెప్రజలను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రాకేశ్ అనే యువకుడికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి బంపర్ డ్రా గెలుచుకున్నారని, హైదరాబాద్ ఆఫీస్‌కు వస్తే బహుమతి ఇస్తామని నమ్మబలికారు. దీనికి ముందుగా రాకేశ్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాల్సి ఉంటుందని నమ్మించారు. వారి మాటలు నమ్మి ఓటీపీ చెప్పడంతో రాకేశ్ బ్యాంక్ ఖాతాలో రూ.25వేలు మాయమయ్యాయి.

నమ్మించి.. నగలు మాయం చేసి

ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నగలు మెరుగుపెడతామంటూ ఇద్దరు వ్యక్తులు గ్రామంలో సంచరించారు. వారిని నమ్మిన ఓ మహిళ తన నగలు ఇవ్వగా, ఆమెను మాటల్లో పెట్టిన కేటుగాళ్లు ఆ నగలను ఓ మూటలో కట్టారు. ఆమెపై మత్తుమందు చల్లి పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత ఆమెకు మెలకువరావడంతో మోసపోయానని గుర్తించి కేకలు వేయగా, చుట్టుపక్కల వారు గుమిగూడి ఊరిలో గాలించినా మోసగాళ్ల ఆచూకీ లభించలేదు.

అవగాహన కల్పిస్తున్నా..

గ్రామీణులు మోసపోతున్న తీరుపై ఎప్పటికప్పుడు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరుతున్నారు. అనుమానాస్పదంగా ఎవరైతే కనిపిస్తే సమాచారం అందించాలని చెబుతున్నారు. అయినా ప్రజలు ఇతరులను నమ్మి మోసపోతూనే ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్‌మోసాలు, క్షుద్రపూజలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మంత్రాలు అనే వాటిని నమ్మవద్దని కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా ప్రజలకు వివరిస్తున్నాం. అత్యాశకు పోయి మోసపోతున్నారు. సైబర్‌క్రైం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలి. – శ్రీనివాస్‌గౌడ్, సీఐ, ఎల్లారెడ్డిపేట

నన్ను చంపి నా భూమి తీసుకోండి

- ఉద్రిక్తల మధ్య జాతీయ రహదారి పనులు
- అడ్డుకున్న రైతు.. పోలీసు స్టేషన్‌కు తరలింపు


రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మానకొండూర్: 'నాకు న్యాయం జరిగేంతవరకు జాతీయరహదారి 563కి నా భూమిని ఇచ్చేది లేదు. అలా కాదంటే.. నన్ను చంపి నా భూమిలోంచి రోడ్డు వేయండి' అని మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ తన భూమిలో జరుగుతున్న పనులను మంగళవారం అడ్డుకున్నాడు. నేషనల్ హైవే-563 కోసం మానకొండూర్ మండలంలోని మానకొండూర్, ముంజంపల్లి, అన్నారం, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి వరకు అధికారులు భూ సేకరణ చేపట్టి, ప్రారంభించిన రహదారి విస్తరణ పనులు పూర్తి కావస్తున్నాయి. పలుచోట్లో సేకరించిన భూమికి పరిహారం తక్కువగా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్లో గుంటకు రూ.10లక్షలు ఉండగా.. అధికారులు రూ.63వేలు ఇవ్వడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సుడా పరిధిలోని భూములకు రూ.63 చెల్లిస్తున్నారని, సుడా పరిధిలోని లేని గ్రామాలకు రూ.2లక్షలకు పైగా చెల్లించడమేంటని ప్రశ్నిస్తున్నారు. కొంత మందిరైతులు తమకు న్యాయం చేయాలని రోడ్డు పనులకు ఇప్పటికీ భూములు ఇవ్వలేదు. చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ సైతం తన భూమిని ఇవ్వలేదు. మంగళవారం ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు సంజీవ్, సదన్‌కుమార్ తమ సిబ్బందితో కుమార్ భూమి వద్దకు చేరుకున్నారు. బందోబస్తు మధ్య హైవే పనులు చేపట్టారు. తన భూమిని లాక్కోవద్దని, న్యాయం చేయాలని కుమార్ ఆర్డీవో ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. నోటీసులు ఇవ్వకుండా పనులు ఎలా చేపట్టుతున్నారని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. అనంతరం నేషనల్ హైవే పనులు కొనసాగించారు.

జాతీయ పోటీలకు మాధవి


మాధవి

కరీంనగర్‌స్పోర్ట్స్: గుజరాత్ ఈ నెల 3వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారిణి మాధవి ఎంపికైనట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. మంచిర్యాల జిల్లా మంద్రమర్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయపోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మాధవి ప్రస్తుతం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా కొనసాగుతున్నారు. మాధవిని తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్ అభినందించారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

సిరిసిల్లటౌన్: ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పతకాలు సాధించారు. మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20 మంది క్రీడాకారులు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి తమిళనాడులోని చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ క్రియేటివ్ ఫామ్ వెపన్ విభాగంలో ఎలగందుల శ్రీనివాస్ బంగారు, ఫైట్ జూనియర్ బాలికల విభాగంలో గంగ నవేణి ప్రవళిక, అన్నాలదాస్ లక్ష్మీప్రసన్న, జూనియర్ బాలుర విభాగంలో చోడిబోయిన లోకేశ్, ఏర్నాల రాజశేఖర్, సబ్ జూనియర్ బాలికల విభాగంలో గజ్జెల శ్వేదిక, కర్నె యుతిక, బాలుర విభాగంలో గౌతమ్‌ఆనంద్, బోడిబోయిన శివష్, కొండ శ్రీరామ్, చిల్డ్రన్ కెడేట్ విభాగంలో గజ్జెల హిరణ్మయి, షేక్ ఆజహన్ రజత, కాంస్య తదితర పతకాలు సాధించారు. ఈసందర్భంగా క్రీడాకారులను తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ మహిపాల్, కోశాధికారి పన్నీరు శ్రీనివాస్ అభినందించారు.

శ్రీచైతన్య ఫార్మసీ విద్యార్థులకు జాతీయ ర్యాంకులు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ నాలుగో సంవత్సరం విద్యార్థులు జాతీయస్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలలో మంగళవారం అభినందించారు. జీప్యాట్‌లో డి.సౌమ్య మొదటి ర్యాంకు, భూక్యా సొడన్న రెండోర్యాంకు సాధించగా, నీఫర్ ప్రవేశ పరీక్షలో డి.సౌమ్య, వి.సుచిత్ర, వి.శివకష్ణ ఉత్తీర్ణులయ్యారు. టీజీపీజీఈసీఈటీలో సుచిత్ర 42వ ర్యాంకు, కె.ప్రభాస్ 125వ ర్యాంకు, ఎస్.గౌతమి 160వ ర్యాంకు, వి.వర్షిత్ 168వ ర్యాంకుతో సహా మొత్తం 49 మంది రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి తమ కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామనరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అప్పారావు, హెచ్‌వోడీలు ఎం.రవీందర్, జి.చంద్రకళ, కె.రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కళాసిల్క్ చేనేత హస్తకళకు ఆదరణ


ప్రదర్శనలో సందర్శకులు(ఫైల్)

కరీంనగర్: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా అంబేద్కర్‌భవన్ సాయినగర్-8వ క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైనర్, పోచంపల్లి చీరలు, డ్రస్ మెటీరియల్స్, చుడీదార్స్, షూటింగ్స్ షర్టింగ్స్, జ్యువెల్లరీ, బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. హర్యానా బెడ్‌కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టన్స్, స్టోన్ జ్యువెల్లరీ, పెరల్స్, క్రాఫ్ట్స్, బంజారా, కోల్‌కతా బ్యాగులు, ఒడిశా పెయింటింగ్స్, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరీ, రాజస్తాన్ కోటా బాందేజన్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, ఉత్తరప్రదేశ్ జామ్దాని, బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్ పాటు పలు రకాల వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చొప్పదండి: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. పదోతరగతి విద్యార్థి శ్రీగాధ స్పందన గోల్డ్ మెడల్ సాధించగా, జునగారి రాంచరణ్ రెండు విభాగాల్లో గోల్డ్, బ్రౌంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ అభినందించారు.

గ్రామపంచాయతీ గదికి తాళం


గ్రామపంచాయతీ గదికి వేసిన తాళం

ఓదెల(పెద్దపల్లి): అద్దె చెల్లించడం లేదనే కారణంతో హరిపురం గ్రామ పంచాయతీ గదికి యజమాని తాళం వేశారు. దీంతో సోమవారం పంచాయతీ కార్యదర్శితోపాటు సిబ్బంది ఆరుబయటనే విధు లు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పక్కాభవన నిర్మాణానికి పదేళ్లక్రితం శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి పంచాయతీ కార్యకలాపాలు అద్దెగదిలోనే కొనసాగిస్తున్నారు. ప్రతీనెల రూ.800 చొప్పున అద్దె చెల్లించేందుకు యజమానితో ఒప్పందం కుదిరింది. అయితే, రెండేళ్లకు సంబంధించి రూ.20వేల అద్దె బాకీ ఉండిపోయింది. అద్దె చెల్లించకపోవడంతో యజమాని ప్రభాకర్‌రెడ్డి పంచాయతీ గదికి తాళం వేశాడు.

బాబ్లీ ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత


ఎత్తివేసిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ 14 గేట్లను మంగళవారం ఎత్తారు. గేట్లను ఏటా జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు తెరిచి ఉంచనున్నారు. ఎగువప్రాంతాల నుంచి బాబ్లీ ప్రాజెక్ట్‌లోకి వచ్చే వరద దిగువకు రానుంది. జగిత్యాల జిల్లాకు సాగు, తాగునీరు అందించే ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు వచ్చే అవకాశం ఉంది. గేట్లు ఎత్తివేత కార్యక్రమంలో పోచంపహాడ్, ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, సీడబ్ల్యూసీ హైదరాబాద్ ఈఈ ఎంఎల్.ఫ్రాంక్లిన్, మహారాష్ట్రలోని నాందేడ్ డివిజన్ ఈఈ సీఆర్.బన్సార్, పోచంపహాడ్ ఈఈ చక్రపాణి, కొత్త రవి ఉన్నారు.

రైల్వేగేజ్ రాడ్‌ను ఢీకొట్టిన లారీ


లారీపై విరిగిపడిన గేజ్‌రాడ్

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి రైల్వేగేటు వద్ద భారీ వాహనాల ప్రవేశాన్ని అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన గేజ్‌రాడ్‌ను మంగళవారం ఓ లారీ ఢీకొట్టడంతో విరిగిపోయింది. కరీంనగర్ నుంచి చొప్పదండి వైపు ప్రధాన రోడ్డుపై ఉన్న రైల్వేగేటును ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా దారి మళ్లించారు. భారీ వాహనాలు రాకుండా రైల్వేగేటుపై గేజ్‌రాడ్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం భారీ వాహనం రావడంతో గేజ్‌రాడ్ విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం మేర్పడింది. రైల్వేసిబ్బంది వచ్చి గేజ్‌రాడ్‌ను తొలగించగా పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఎరువులపై పక్కా నిఘా

- శాంపిల్స్ సేకరణకు ఆదేశాలు
- అక్రమాలకు అడ్డుకట్ట


ఎరువుల బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎరువుల అవసరమిలా (మెట్రిక్ టన్నుల్లో)	
యూరియా	26,850
డీఏపీ	43,097
ఎంవోపీ	10,201
కాంప్లెక్స్	24,540
ఎస్ఎస్‌పీ	11,089

కరీంనగర్ అర్బన్: ఎరువుల విక్రయాల్లో అక్రమాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రికార్డుల నిర్వహణతో పాటు తనిఖీలకు ఆదేశించింది. పంటల సాగులో విత్తనాలు, ఎరువులే దిగుబడులపై ప్రభావం చూపుతాయి. ఎరువుల ద్వారానే పంటలకు పోషకాలు అందుతాయి. నత్రజని, భాస్వరం, పొటాష్, డీఏపీ, ఎన్పీకే కాంప్లెక్సులు, ఎన్పీకే మిక్చర్లు, నీటిలో కరిగేవి, సూక్ష్మపోషకాలు, సేంద్రియ ఎరువులు, బయోఫర్టిలైజర్లు, నానో డీఏపీ, తదితర రకాల ఎరువులు లభ్యమవుతాయి. ఈ క్రమంలో ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 ప్రకారం ఎరువుల పరిమాణం, నాణ్యతపై నియంత్రణను సూచిస్తోంది. ఈ క్రమంలో ప్రతీ గ్రామం, మండలం, జిల్లాల వారీగా పంటల సాగు విస్తీర్ణం అంచనాల ప్రకారం ఎరువుల వినియోగంపై అధికారులు ప్రణాళిక రూపొందిస్తారు. మండల స్థాయిలో ఫర్టిలైజర్ ఇన్‌స్పెక్టర్‌గా ఏఓ వ్యవహరిస్తుండగా ఎరువుల నాణ్యతను తెలుసుకునేందుకు నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిస్తారు. ప్రణాళిక ప్రకారం ఎరువులు అందుబాటులో ఉంచేలా కలెక్టర్ పర్యవేక్షిస్తుండగా వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన ఎరువుల రిటైల్ డీలర్లు, సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారు.

ఈపాస్ యంత్రం ద్వారా అమ్మకాలు

ఎరువుల అమ్మకాలు ఈపాస్ యంత్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. రైతులు తమ ఆధార్ కార్డు చూపించి ఈపాస్ యంత్రం ద్వారా ఎరువులు తీసుకోవడం జరిగే ప్రక్రియ. దుకాణ నిర్వాహకులు పారదర్శకంగా వ్యవహరించేలా ఈపాస్ ఉపయోగపడనుండగా పక్కదారి ఏ మాత్రం అస్కారం లేదు. దీని ద్వారా ఎరువుల దుకాణంలో భౌతిక నిల్వ, ఈపాస్ యంత్రంలో నిల్వ సరిపోవాలి. అంటే ఎరువుల నిలవ్వలు, అమ్మకాలు పారదర్శకంగా ఉండనున్నాయి.

శాంపిల్స్ సేకరణతో చర్యలు

ఈ సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో 10వేల ఎరువుల నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ లక్ష్యం నిర్దేశించారు. జిల్లాలో 510 నమూనాలు తీసుకోనున్నారు. ఎరువుల నమూనాల విశ్లేషణలో ప్రమాణాలకు భిన్నంగా ఉంటే.. అలాంటి వాటిని 'నాన్ స్టాండర్డ్'గా వ్యవహరిస్తారు. ఇలాంటి ఎరువులు విక్రయించే డీలర్లపై న్యాయ, పరిపాలనాపరమైన చర్యలు తీసుకుంటారు.

అక్రమాలకు అడ్డుకట్ట

ఎరువుల దుకాణాల్లో నిల్వలు, అమ్మకాల నియంత్రణకు వ్యవసాయశాఖ 'ఫైవ్స్' అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీన్నే 'ఫర్టిలైజర్ వెరిఫికేషన్ సిస్టం' అంటారు. ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకుడు, మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రతీ వారంలో రెండు సార్లు ఎరువుల దుకాణాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తారు. రిజిస్టర్‌లో నిల్వలు, భౌతిక నిల్వలు, ఈపాస్ యంత్రంలోని నిల్వలను యాప్‌లో నిక్షిప్తపరుస్తారు. రిజిస్టర్లోనూ ధ్రువీకరిస్తారు. తేడాలేమైనా ఉంటే ఫర్టిలైజర్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు. ఎరువుల విక్రయాలపై పక్కాగా పర్యవేక్షణ చేస్తున్నామని, పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి వివరించారు.